క్లుప్తంగా

లక్ష్మీనృసింహస్వామికి పూజలు

సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వెలసిన లక్ష్మీనృసింహస్వామికి పూజలు చేసేందుకు భక్తులు గురువారం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు స్వామివానికి ప్రత్యేకంగా అలంకరించి భక్తులతో పూజలు చేయించారు. స్వామివారిని దర్శిం చుకునేందుకు వచ్చిన భక్తులతో అర్చకులు ఆలయం చుట్టూ మూడు పర్యాయాలు ప్రదక్షిణ చేయించిన అనంతరం క్షీరాభిషేకం, కుంకుమపూజ చేయించారు. దూరప్రాంతాల నుంచి ఉపవాసాలతో వచ్చిన భక్తులకు పూజలనంతరం ఆలయప్రాంగణంలో తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

గురజాడకు ఘనంగా నివాళి


నేతాజీ గ్రంథాలయం వద్ద గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసిన గ్రామస్తులు

బలిజిపేట: సాహితీలోకంలో ధృవతారగా వెలుగొందిన మహానుభావుడు గురజాడ అని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు అన్నారు. మహాకవి గురజాడ వర్ధంతి సందర్భంగా మండలంలోని పెదపెంకి గ్రామంలో గల నేతాజీ గ్రంథాలయం వద్ద గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ సామాజిక సమస్యలపై సమాజాన్ని మేల్కొలిపిన మహానుభావుడని కొనియాడారు. సాహితీలోకంలో ఎంతో పేరుప్రతిష్టలు సాధించి విజయనగరం ఖ్యాతిని నలుదిక్కులా వ్యాపింపచేసిన మహనీయుడని, అటువంటి వ్యక్తి స్మరణ ఎంతో అదృష్టమన్నారు. కార్యక్రమంలో సీహెచ్.సత్యం, జి.కాశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే జోగారావు


పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పేదలకు అండగా ప్రభుత్వం ఎప్పుడూ నిలుస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం బలిజిపేట మండలం గంగాడ గ్రామానికి చెందిన భూమి లేని నిరుపేదలకు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి లేని పేదలకు భూమి పంపిణీ చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పాలిట దేవుడిగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్ష


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మక్కువ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్షను హెచ్‌ఎం హేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని శంబర, వెంకటభైరిపురం, మక్కువ, ఎ.వెంకంపేట, ఆదర్శపాఠశాల, కేజీబీవీ విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. పరీక్షా కేంద్రాన్ని, హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయుడు రాయిడి శంకరావు పరిశీలించారు.

పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

సాలూరు: పట్టణంలో పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, కమిషనర్ జయరాం ఆధ్వర్యంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలను సభ్యులు ఆమోదించారు. వార్డుల్లో సమస్యలపై కౌన్సిలర్లు ప్రస్తావించారు. వార్డుల్లో రూ.50 వేల లోగా చేపట్టాల్సిన పనులకు సంబంధించి జనరల్ ఫండ్ నిధుల నుంచి ఖర్చు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్‌ఛైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ఫ్లోర్‌లీడర్ గొర్లె జగన్, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



- 18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు కావాలి
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- పార్వతీపురంలో ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ
- పాల్గొన్న జేసీ గోవిందరావు

పార్వతీపురం టౌన్: దేశ భవిష్యత్‌ను మార్చేందుకు ఓటే వజ్రాయుధమని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం జిల్లా కార్యాలయాల సముదాయం (ఆర్‌సీఎం) నుంచి కలెక్టరేట్ వరకు ఓటరు నమోదు అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్ వద్ద మానవహారంగా ఏర్పడి ఓటరు అవగాహనకు సంబంధించి స్లోగన్లు నినదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నడిపించేది యువతేనని, ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం భారతదేశమని, ప్రతియువత ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డిసెంబరు 2, 3 తేదీలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తికానున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, అందుకు కావలసిన ఫారాలు బూత్ లెవెల్ అధికారుల వద్ద ఉంటాయని లేదా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో నేరుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ర్యాలీకి హాజరైన విద్యార్థులు తమ కుటుంబాలలో 18 సంవత్సరాలు నిండిన వారు ఉంటే వారిని ఓటరుగా చేర్పించాలని, ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొనేలా అవగాహన కల్పించాలని కోరారు.

18ఏళ్లు నిండితే ఓటరుగా నమోదుకావాలి

రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కోసం, ఓటు వేసే విధానాన్ని తెలుసుకునేందుకు ఏర్పాటు చేస్తున్న శాశ్వత, మొబైల్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ ప్రదర్శన సెంటర్లను సందర్శించి నమూనా ఓటు వేసి, ఓటు వేసే విధానాన్ని తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడు, జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శివన్నారాయణ, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు


మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ గోవిందరావు

విద్యాభివృద్ధికి కృషి

వంగర: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. మండలంలోని అరసాడలో హిందీ, వంగరలో సోషల్ స్టడీస్ పాఠ్యాంశాలపై గురువారం సబ్జెక్ట్ కాంప్లెక్స్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రొగ్రాం(లిప్)లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులంతా విద్యార్థులు బాగా చదవడం, రాయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ముద్దాడ రమణమ్మ, ఖండాపు జగదీశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: మండలంలోని గోచెక్క పంచాయతీ కొసరివానివలస గ్రామంలో ప్రధాన సమస్య అయిన బీటీ రోడ్డు నిర్మాణం పూర్తిచేసిన ఎమ్మెల్యే జోగారావు గురువారం గ్రామానికి వచ్చి ప్రారంభించడంతో గిరిజనులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తమ ఆశను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే జోగారావు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఇచ్చిన మాట మేరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేశామన్నారు. 2024 ఎన్నికల్లో సీఎం జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఎంపీపీ మజ్జి శోభారాణి, ఏఎంసీ ఛైర్‌పర్సన్ మరడాన భాగ్యశ్రీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీ బి.రవికుమార్, గ్రామసర్పంచ్, ఎంపీటీసీ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనవరి 19 నాటికి లక్ష్యాలు పూర్తి చేయాలి

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

మక్కువ/సాలూరు: గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఇళ్లను జనవరి 19లోగా పూర్తి చేయాలని సాలూరు నియోజకవర్గ హౌసింగ్ ప్రత్యేక అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల ఎంపీడీఓలు, గృహనిర్మాణ సంస్థ, పంచాయతీ రాజ్, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ముందుగా అనుకున్న మేరకు లక్ష్యాలను అధిగమించే విధంగా పని చేయాలని, నియోజకవర్గం పరిధిలో ముందుగా నిర్దేశించుకున్న మేరకు రెండు వేల 619పక్కా ఇళ్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ మేరకు లబ్ధిదారులను సమాయత్త పరిచేందుకు ఏ విధంగా అవగాహన కల్పించాలో సూచనలు చేశారు. ఈ విషయమై ఎవరు నిర్లక్ష్యంగా ఉన్నా సహించేది లేదని, అలాగే హౌసింగ్ అధికారులకు విద్యుత్, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు సహకరించాలని కోరారు.


సమీక్ష నిర్వహిస్తున్న ఐటీడీఏ పీఓఓ విష్ణు చరణ్

జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే కంబాల

వంగర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గీతనాపల్లి గ్రామంలో గురువారం పర్యటించారు. సర్పంచ్ నెయిగాపుల శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే, తదితరులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హత ఉండి పథకాలు ఎవరికైనా అందకపోతే వెంటనే తెలియజేయాలన్నారు. ఈ ప్రభుత్వంలో అన్నివర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని చెప్పారు. సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్య, వైద్యరంగాలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. నవరత్నాల పథకాలతో పాటు ఇతర సంక్షేమ పథకాల ద్వారా సుమారు 3 లక్షల కోట్ల రూపాయలు ప్రజల ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు. సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని తెలిపారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు అండ్ కో వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కిమిడి సన్యాసినాయుడు, యలకల వాసునాయుడు, ఎంపీడీఓ హనుమంతు శశిభూషణరావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

నాణ్యతకు లోబడి రోడ్డు పనులు


మెటల్, గ్రావెల్‌ను రోలింగ్ చేస్తున్న యంత్రం

సీతానగరం: మండలంలోని నాలుగు గ్రామాల ప్రజలు, రైతులకు ఉపయోగపడే విధంగా నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులు నిబంధలనలకు లోబడి నిర్వాహకులు పూర్తి చేయాలని పీఆర్(ప్రాజెక్ట్స్) ఏఈ జి.శంకరరావు అన్నారు. ఈ మేరకు గురువారం తామరఖండి-బక్కుపేట గ్రామాల మధ్య రూ.20 లక్షలతో నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తామరఖండి నుంచి బక్కుపేట వరకూ రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని బీటీరోడ్డు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరిందే తడవుగా బీటీరోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరుచేస్తున్నట్లు ప్రకటించి పనులకు భూమిపూజ చేసినట్లు తెలియజేశారు. దీంతో రెండు గ్రామాల మధ్య రోడ్డు వైడ్నింగ్, గ్రావెల్ వేసి రోలింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. మూడో లేయరుగా మెటల్, గ్రావెల్ వేసి రోలింగ్ పూర్తి కావచ్చిందని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా రోడ్డు పని పూర్తి చేయడానికి నిర్వాహకులపై ఒత్తిడి తేవాలని సూచించారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి చేయాలన్నారు. ఎంపీటీసీ వై.గౌరీశ్వరి మాట్లాడుతూ తామరఖండి-బక్కుపేట గ్రామాల మధ్య బీటీరోడ్డు పనులు పూర్తయితే ఆర్.వెంకంపేట, బక్కుపేట, తామరఖండి, బళ్లకృష్ణాపురం, కంచివానివలస, రామవరం గ్రామాల పంటసాగు రైతులకు, ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు ఉపయోగ పడుతుందన్నారు. దీర్ఘకాలం రోడ్డు ఉండేవిధంగా పనులు చేయాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- ఆర్డీఓ కె. హేమలత


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

సీతానగరం: మండలంలోని జగనన్న కాలనీల్లో పునాదులు, గోడల వరకూ నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను వలంటీర్ల సహకారంతో లబ్ధిదారులకు పీఆర్, సచివాలయల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు అవగాహన కల్పించి చర్యలు చేపట్టాలని ఆర్డీఓ కె.హేమలత కోరారు. ఈ మేరకు గురువారం ఆమె గ్రామాల వలంటీర్లు సచివాలయ ఉద్యోగులు, గృహనిర్మాణ అధికారులతో ఎంపీడీఓ బి కృష్ణమహేష్ రెడ్డి, హౌసింగ్ డీఈ ప్రసాద్‌బాబుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ డిసెంబర్ నెలాఖరులోగా 689 ఇళ్లను పూర్తి చేయడానికి టార్గెట్ ఇచ్చినట్లు చెప్పారు. టార్గెట్ పూర్తి చేయడానికి వలంటీర్ల సహకారం తీసుకోవాలని సూచించారు. వెలుగు ద్వారా ఎంత మంది లబ్ధిదారులకు రుణసహాయం అందించారో గుర్తించి వారితో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి గృహనిర్మాణం, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు. అలాగే పూర్తిచేసిన గృహాలను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఏఈ జానకీరాం. వర్క్‌ఇన్‌స్పెక్టర్లు కృష్ణ, నాయుడు పాల్గొన్నారు.

బోదవ్యాధి నివారణే లక్ష్యంగా వైద్యపరీక్షలు


పెదభోగిలిలో మాట్లాడుతున్న సీహెచ్ఓ ఎస్వీ రమణ

సీతానగరం: మండలంలోని సీతానగరం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాల్లో బోదవ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కల్పించుకోవాలని సీహెచ్ఓ ఎస్వీ రమణ కోరారు. ఈ మేరకు గురువారం రాత్రి సీతానగరం, పెదభోగిలి, కాలనీ, అప్పయ్యపేట గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు రక్త నమూనాలు సేకరించారు,. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వం చేస్తున్న చర్యల్లో భాగంగా రాత్రి 7గంటల నుంచి 8.30 గంటల వరకూ వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు కలిసి ఇంటింటికీ వెళ్లి రక్తనమూనాలు సేకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ శర్మ, ధనుంజయ్, హరికృష్ణ, చంద్రినాయుడు, శ్రీనివాసరావు ఎంఎల్‌హెచ్‌పీ సునీత, సంధ్య, కుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి ప్రదాతను దీవించండి

- ఎంపీపీ బి.ప్రమీల


పాచిపెంట: వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలకు సంబంధించి డిస్ ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు


సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన జెడ్పీటీసీ రవికుమార్

పాచిపెంట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమ, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి దీవించి ముఖ్యమంత్రిని చేయాలని పాచిపెంట ఎంపీపీ బి.ప్రమీల కోరారు. ఈ మేరకు మండలంలోని కేసలి సచివాలయం పరిధిలో గురువారం సర్పంచ్ ప్రతినిధి సత్తారపు రాము ఆధ్వర్యంలో నిర్వహించిన వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి నిరంతర ప్రక్రియలా కొనసాగాలంటే జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముత్యాల నాయుడు, వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్రనాథ్, ఎస్సీ సెల్ నాయకులు పిట్ల పాపారావు, సచివాలయ కన్వీనర్ మోహన్ రావు, కేసలి ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.


మార్కొండపుట్టిలో..

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి గ్రామంలో గురువారం ఆంధ్రా కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, ఎంపీటీసీ మండంగి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు తేలు శ్రీరాములు నాయుడు, బొత్స అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బలిజిపేటలో..

ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చిన సీఎం జగన్మోహన్ రెడ్డి అని బలిజిపేట జెడ్పీటీసీ ఎ.రవికుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన బలిజిపేట మండలంలోని గలావల్లి సచివాలయ పరిదిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.చంద్రచూడామణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీడీఓ విజయలక్ష్మి, కె.దాలినాయుడు, మాధవనాయుడు, సూర్యనారాయణ, జి.సత్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మక్కువ: ప్రభుత్వం అందించిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రంగునాయుడు


సీతానగరం: సంక్షేమపథకాల డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీరాములునాయుడు

బాబాకు ప్రత్యేక పూజలు


బాబాను దర్శించుకున్న భక్తులు

పార్వతీపురం: మండలంలోని సంగంవలస గ్రామంలో గల షిర్డీసాయిబాబా మందిరంలో బాబాకు గురువారం విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. కార్తీకమాసం కావడంతో బాబాను దర్శించుకునేందుకు భక్తులు అధికంగా విచ్చేశారు. బాబా భక్తులు సత్సంగం కార్యక్రమం నిర్వహించి భజనలు చేశారు. అనంతరం ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.